

స్టాల్‌ను పరిశీలిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




హైదరాబాద్ వార్త


- ఫ్యూచర్‌సిటీలో ఉత్సాహంగా "గ్లోబల్ సమ్మిట్"
- హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు
- ప్రత్యేక ఆకర్షణగా " నెట్ జీరో స్టాల్ "
- డిఆర్‌ఎఫ్ పనితీరుపై హైడ్రా విడియో ప్రదర్శన

# ఫ్యూచర్ సిటీపైనే ప్రపంచం ఫోకస్

హైదరాబాద్,డిసెంబరు 7,ప్రభాతవార్త:
ఆర్థిక వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మహిళా సాధికారత, రైతుల అభ్యున్నతి, ఆవిష్కరణలు, పర్యావరణ సుస్థిరతకు ప్రాధాన్యతనిస్తూ నెట్‌జీరో లక్ష్యంగా మెరుగైన జీవన ప్రమాణాల సాధన గమ్యంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. దీనికి దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఓ వైపు అత్యాధునిక టెక్నాలజీ హంగులు మరోవైపు తెలంగాణ ప్రత్యేక ఆకర్షణల మేళవింపులతో ఏర్పాట్లు అద్భుతంగా చేశారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీలో డిజిటల్ తెరలతో నిర్మించిన టన్నెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈనేపథ్యంలో అంతర్జాతీయ స్థాయికి ఏ మాత్రం తీసిపోని రీతిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా వద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నెట్ జీరో స్టాల్ కు విశేష ఆదరణ లభిస్తుంది. ఈ స్టాల్ లో ఎలక్ట్రిసిటీ వెహికల్, వేస్ట్ టు ఎనర్జీ, విండ్ పవర్, పంప్డ్ స్టోరేజ్ పవర్ జనరేషన్, బిఈఎస్‌ఎస్, సోలార్ ప్యానల్స్ విధానంలో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల నమూనాలను ఏర్పాటు చేశారు. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, విదేశీ ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు స్టాల్ ను సందర్శించి అక్కడ ప్రదర్శిస్తున్న నమూనాలను పరిశీలించారు. అలాగే పర్యావరణం పై మరియు గ్రీన్ ఎనర్జీ పై అవగాహన కల్పించడం గురించి నెట్ జీరో క్విజ్ సాఫ్ట్వేర్ కూడా రూపొందించారు. పలువురు ఎంతో ఉత్సాహంగా పాల్గొని నెట్ జీరో సర్టిఫికెట్‌ను పొందారు. ఈసందర్భంగా సందర్శకులకు సిఎండీ ముషారఫ్ ఫరూఖీ, డైరెక్టర్ లు డాక్టర్ నరసింహులు, శివాజీ ఇతర అధికారులు నమూనాల గురించి వివరించారు. అలాగే గ్లోబల్ బల్ సమ్మిట్‌లో వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి ఏర్పాటు చేసిన హైడ్రా స్టాల్ అందరినీ ఆకట్టుకుంటోంది. వర్షం పడిన సమయంలో రహదారులపైన, నీట మునిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు చేసిన సేవలను ఆసక్తిగా అడిగి తెలు సుకుంటున్నారు. వరదకు గల కారణాలను తెలుసుకుని.. సమస్య తలెత్తకుండా తీసుకున్న చర్యల వీడియోలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్టాల్‌ను సందర్శించి ప్రతినిధులతో చర్చించడం.. సమస్య పరిష్కారంలో నిపుణుల సలహాలను స్వీకరించారు.హైదరాబాద్ నగరం ఎంతో భద్రమో.. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్( డీఆర్ ఎఫ్) టీమ్‌ల పని తీరును వివరిస్తూ రూపొందించిన వీడియో సమ్మిట్‌కు వచ్చిన వారిని ఆకట్టు కుంటోంది. అలాగే హైడ్రా కార్యకలాపాలకు సంబంధించిన పోస్టర్‌ను పలవురు తీసుకుని పరిశీలించి ప్రశంసిస్తున్నారు. చెరువుల పునరుద్ధరణకు హైడ్రా తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు







## రంగనాథుడి గుడి మాన్యం భూములు అధికారుల తనిఖీ

-'ప్రభాతవార్త' కథనానికి స్పందన...
-అక్రమ రోడ్డును పూర్తిగా మూసివేస్తామని ప్రకటన
-దేవాలయ మాన్యం భూముల సర్వే చేపడతాం
: ఈవో ఆంజనేయులు

గచ్చిబౌలి, డిసెంబరు 8 ప్రభాతవార్త
గోపన్‌పల్లిలోని పురాతన రంగనాథస్వామి దేవాలయం మాన్యం భూములు అన్యాక్రాంతంపై 'ప్రభాతవార్త' ప్రచురించిన కథనానికి దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి మాన్యం భూములను పరిశీలించారు. గ్రామస్థులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూముల రక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణ సంస్థ అక్రమంగా ఏర్పాటు చేసిన రహదారిని మొత్తం మూసివేస్తామని, రెండు రోజుల్లో స్థానికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో దాదాపు 500 సంవత్సరాల పురాతన రంగనాథ స్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయం మాన్యం కింద గోపన్‌పల్లి వ్యాప్తంగా దాదాపు 28 ఎకరాల భూములు ఉన్నాయి. గోపన్‌పల్లి గ్రామ సర్వే నెంబరు 268లో ఉన్న 13.18 ఎకరాల దేవుని మాన్యం భూమిలో కొందరు అక్రమ రహదారి నిర్మాణం చేపట్టారు. మట్టి బాటగా ఉన్న ఈ దారిలో గత సెప్టెంబరులో రాత్రికి రాత్రే సిసి రోడ్డు నిర్మించగా, నాడు దేవాదాయ శాఖ అధికారులు స్పందించి రోడ్డును తొలగించారు. అనంతరం రాకపోకలు సాగకుండా కందకాలు తవ్వి అడ్డుకున్నారు. కాగా దేవుని మాన్యం భూమికి పక్కనే ఉస్మాన్ నగర్ గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్థుల నిర్మాణ సంస్థ మరోసారి దేవుని మాన్యం భూమిలో నుంచి రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఈమేరకు రహదారి నిర్మాణంలో గతంలో విఫలం కావడంతో ఈ దఫా మొదట నాయకులను మచ్చిక చేసుకునేందుకు చూసింది. ఇందులో భాగంగా కొందరు నాయకులకు డబ్బుల పంపకాలు చేపట్టి, వారు రహదారికి అడ్డురాకుండా చూసింది. ఈ విషయం గోపన్‌పల్లిలో హాట్ టాపిక్‌గా మారడంతో ప్రభాతవార్త దినపత్రిక సోమవారం సంచికలో 'గోపన్‌పల్లి రంగనాథుడి గుడి మాన్యం భూముల అన్యాక్రాంతం... హాట్ టాఫిక్‌గా డబ్బుల ఎర' పేరుతో కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన దేవాదాయ శాఖ ఈఓ ఆంజనేయులు సోమవారం గోపన్‌పల్లిలోని రంగనాథుడి మాన్యం భూములను సందర్శించారు. సర్వే నెంబరు 268లో ఉన్న 13.18 ఎకరాల మాన్యం భూములను గ్రామస్థులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు నిర్మాణ సంస్థ అక్రమ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబరు 268లోని దేవుని మాన్యం భూముల రక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణ సంస్థ వేసిన రోడ్డును గత మూడు నెలల క్రితం తొలగించామని, మరోసారి భూమిని చదును చేసి మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గుర్తించామన్నారు. దేవుని మాన్యంలో నుంచి ఎటువంటి రహదారి లేదని, మరో రెండు రోజుల్లో ఈ దారిని మూసివేసి రాకపోకలు సాగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక నిర్మాణ సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. దేవుని మాన్యంలో నుంచి రోడ్డు నిర్మాణానికి ఎవరైనా ప్రయత్నిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పాటు గోపన్‌పల్లి రంగనాథస్వామి దేవుని మాన్యం భూముల సమగ్ర సర్వే చేపడుతామని, ఇందుకోసం ఉన్నతాధికారులకు లేఖ రాస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లి సర్వే నెంబరు 268లోని దేవుని మాన్యంలో అక్రమ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

## అక్కడ వద్దు ...ఇక్కడ కలపండి..?

-మున్సిపాలిటీల విలీనంపై రాజకీయ ఒత్తిళ్లు
-ఎమ్మెల్యేలు,ఎంపిల నుంచి ఉన్నతాధికారులకు ఫోన్లు
-తమ వినతినికూడా పరిగణంలోకి తీసుకోవాలని విజ్ఞప్తులు




హైదరాబాద్, డిసెంబరు 8,ప్రభాతవార్త:
27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ప్రభుత్వం జిహెచ్‌ఎంసిలో కలిపిన విషయం తెలిసిందే..ఈనేపథ్యంలో అధికారులు వార్డుల విభజన, రికార్డుల ఆస్వాధీనం వంటిఅంశాలపై దృష్టిపెట్టారు. ఈప్రక్రియలో భాగంగా వార్డుల పునర్విభజన ముసాయిదాను రెండు రోజుల క్రితమే జారీ చేసేందుకు హడావుడి జరిగినా, నోటిఫికేషన్ జారీ కొంత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. విలీనం,వార్డుల పునర్విభజన ప్రక్రియను జీహెచ్‌ఎంసీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లు ఇప్పటికే ముసాయిదాను సిద్ధం చేసి చీఫ్ సెక్రటరీకి పంపినట్లు తెలుస్తుంది. అయితే చీఫ్ సెక్రటరీ నుంచి ఈ ముసాయిదా సీఎం రేవంత్ రెడ్డి వద్దకు పంపించే ప్రక్రియ గ్లోబర్ సమ్మిట్ కారణంగా ఆలస్యం కానున్నట్లు అధికార వర్గాల సమాచారం.అలాగే వార్డుల పునర్విభజనకు సంబంధించి సర్కారుకు, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో అనేక రకాల రాజకీయ వత్తిళ్లు వస్తుండటం కూడా నోటిఫికేషన్ జారీ ఆలస్యానికి మరో కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికే తుక్కుగూడ స్థానిక సంస్థను చార్మినార్ జోన్ లో కాకుండా ఎల్బీనగర్ జోన్‌లో విలీనం చేయాలని శివారు ప్రాంతానికి చెందిన ఓప్రజాప్రతినిధి జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్లకు పలు సార్లు వత్తిడి చేసినట్లు సమాచారం. ఈ రకంగా గ్రేటర్ లోని మొత్తం 25 మంది ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి రాజకీయ వత్తిళ్లు పెరిగినట్లు సమాచారం. దీనికి తోడు సోమవారం నుంచి ప్రారంభమైన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు దేశ విదేశాల నుంచి ప్రతినిధులు హాజరు కావటంతో, ఈ పునర్విభజనకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేస్తే రాజకీయంగా ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న విషయాన్ని గుర్తించిన సర్కారు ప్రస్తుతం ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ను చీఫ్ సెక్రటరీ వద్ద పెండింగ్ లో ఉంచినట్లు తెలిసింది. సమ్మిట్‌కు ముందు, సమ్మిట్ జరుగుతున్న సమయంలో నోటిఫికేషన్ జారీ చేస్తే వార్డుల పునర్విభజనపై విపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఆందోళనలు వ్యక్తం చేస్తూ, గ్లోబల్ సమ్మిట్ లో సిటీ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీసే అవకాశమున్నట్లు గుర్తించిన సర్కారు ముసాయిదా నోటిఫికేషన్ పెండింగ్ లో పెట్టి ఈ నెల 11 తర్వాత సీఎం నిర్ణయం మేరకే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. పక్కాగా వార్డుల విభజన..
వార్డుల రూపకల్పన పాతజిహెచ్‌ఎంసి పరిధిలోని 150 మున్సిపల్ వార్డులను 260 నుంచి 270 వరకు విభజించినట్లు సమాచారం. అలాగే ఇటీవల జీహెచ్‌ఎంసీలో విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థలను 30 నుంచి 40 వార్డులుగా విభజించి, మొత్తం 300 వార్డులుగా ఫిక్స్ చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రక్రియ ఎంతో వేగంగా పక్కాగా, పకడ్బందీగా జరిగినట్లు అధికారవర్గాల సమాచారం.ఒక మున్సిపల్ వార్డు పరిధి రెండు సర్కిళ్ల పరిధిలోకి రాకుండా,ఒక సర్కిల్ పరిధి రెండు జోన్ల పరిధిలోకి రాకుండా జాగ్రత్త పడుతూ ఈ పునర్విభజన ముసాయిదాను తయారు చేసినట్లు తెలుస్తుంది. ముఖ్యం గా వచ్చే సంవత్సరం జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను దృష్టి లో పెట్టుకుని వార్డుల పునర్విభజన ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలిసింది.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి

-తెలంగాణ విద్యార్థి జెఏసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
-హాజరైన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ముషీరాబాద్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలు తక్షణమే చెల్లించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సమీట్ల పేరుతో వేలకోట్లు వృధా చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును మాత్రం విస్మరిస్తోందని ఆరోపించారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 12లక్షల 75వేల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు దాదాపు పది వేలకోట్లు ఉందని, ఫీజులు చెల్లించకపోవటంతో కాలేజి యాజమాన్యం ఫీజులు కడితేనే గ్రేసు మార్కులు అంటూ వేధిస్తూ ఉండటంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్ నిధులు ఆపి, ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు ఫీజుల బకాయిల కోసం పాదయాత్ర చేసిన రాకేష్, గోనె శ్రీశ్రీ, పవన్, మోహనన, సాయి, వినయ్ పాల్గొన్నారు.

**పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి : వేముల రామకృష్ణ**

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ, హార్టికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీల విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ జేఏసీ నేతృత్వంలో ఇటీవల 42శాతం రిజర్వేషన్లకై ఆత్మ బలిదానం చేసుకున్న సాయిఈశ్వరాచారికి సంతాపంగా నల్ల కండువాలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12,735 గ్రామపంచాయితీలలో కేవలం 2,176 బీసీ రిజర్వేషన్లు కల్పించటం అన్యాయమని, తక్షణమే జీవో 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 79ఏళ్లుగా బీసీలకు అన్యాయం చేశారని, ఇప్పుడు అవమానిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు.



ర్యాలీలో నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేముల రామకృష్ణ తదితరులు

## ద్విచక్ర వాహనంపై నుండి కింద పడి యువకుడి దుర్మణం

ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :
ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి ఒక యువకుడు దుర్మణం చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్‌కు చెందిన అల్లి రమేష్ కుమారుడు అల్లి సాయితేజ (26) ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తు న్నాడు. అయితే ఈనెల 7వ తేదిన రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రామంతాపూర్ నుంచి ఉప్పల్ వైపు వస్తుండగా కేంద్రీయ విద్యాలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్లాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదం తీవ్రంగా జరిగి మృత్యువాత పడినట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు అల్లి సాయి తేజ ( ఫైల్ పోటో)

## టిప్పర్ ఢీ ... ఇద్దరు దుర్మరణం

జీడిమెట్ల, డిసెంబర్ 8, ప్రభాతవార్త
టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని టిప్పర్ వేగంగా వచ్చి వెనుక నుండి ఢీ కొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సూరారం కాలనీ వెంకట రాంనగర్‌కు చెందిన జ్యోతి (32) సోమవారం ఉదయం కూరగాయల షాప్‌కు వెళ్లేందుకు రాపిడో బుక్ చేసుకుని బయలుదేరింది. మార్గ మధ్యంలోని జ్యోతిని టిప్పర్ వెనుక నుండి వచ్చి ఢీకొట్టడంతో రాపిడో డ్రైవర్ సాయిబాబా నగర్, పాండు బస్తీకి చెందిన సురేందర్ రెడ్డి (45)తో పాటు జ్యోతి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జ్యోతి ఫైల్ ఫోటో



సురేందర్ రెడ్డి ఫైల్ ఫోటో

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు


చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం

**చిక్కడపల్లి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 16 వ తేదీ నుండి 2026 జనవరి 14 వ తేదీ వరకు ధనుర్మాస వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి. రాజేంద్రనాథ్ గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్ గౌడ్, అసిస్టెంట్ కమీషనర్, ఈఓ కె.రామాంజనేయులు వివరించారు. 16 న ధనుర్మాసం ప్రారంభం అవుతుందని, 25 వ తేదీ నుండి 29 వ తేదీ వరకు పఫ్లాపత్తు ఉత్సవాల సందర్భంగా 5 రోజుల పాటు సాయంత్రం ఆరు గంటలకు దేవాలయం ద్వారా బంధనం ఉంటుందని, 30 న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం ఐదు గంటల నుండి భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం ఉంటుందన్నారు. 2026 జనవరి 3 న రాత్రి ఏడు గంటలకు నమ్మాళ్వార్ పరమపదోత్సవం, 11 న కూడారై ఉత్సవం ఉంటుందని, 14 న భోగి పండుగ సందర్భంగా గోదా సమేత రంగనాథ స్వామి కళ్యాణం ఉంటుందని వివరించారు. 15 న మకర సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాయణ పుణ్యకాలం, 16 న కనుమ పండుగ ను పురస్కరించుకుని 11 గంటలకు గోదా అమ్మవారి కరినోము ఉత్సవం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## గీతా పారాయణంతో మానసిక ఉల్లాసం


గీత శ్లోకాలు పారాయణం చేసిన వారికి జ్ఞాపికలను బహుకరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** వివేకానంద కేంద్ర కన్యాకుమారి ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాలు సోమవారం స్థానిక నల్లకుంట శంకరమఠంలో ఘనంగా జరిగాయి. సుమారుగా 150 విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొని గీత శ్లోకాలు పారాయణం చేశారు. ఈ ఉత్సవానికి సంస్కార భారతి ప్రతినిధి డాక్టర్ మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గీతా పారాయణం, సంస్కృతంకు సంబంధించి ప్రాముఖ్యతను వివరించారు గీతా పారాయణం వల్ల ఆరోగ్యము మానసిక ఉల్లాసము పెరుగుతాయని అమెరికాలోని రీసెర్చ్ ఇన్స్టిట్యూషన్ వారు తేలింది అని చెప్పారు. వివేకానంద కేంద్ర నిర్వాహకులు శ్రీనివాస రంగాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులకు శ్రేయోభిలాషి ఫిజికల్ డెవలప్మెంట్ మెంటల్ డెవలప్మెంట్ ఆన్సర్ డెవలప్మెంట్ కు గీత చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. శృంగేరి శారదా పీఠం సంస్థానం, ఆవోపా హైదరాబాద్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో లింగా ప్రకాష్, రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జల్సాలకు ప్రభుత్వ ఖజానా బలి

**టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జల్సాలకు ప్రభుత్వ ఖజానా బలవుతోందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నన్ను కోసుకుతిన్నా పైసా లేదు అంటూ పేద మాటలు చెబుతూనే ముఖ్యమంత్రి తన సరదాల కోసం కోట్లలో ప్రజా ధనాన్ని దుబారా చేస్తూ, ఎంసీహెచ్ఆర్‌డీ క్యాంపస్‌ను తన క్యాంప్ ఆఫీస్‌గా మార్చుకుని, అక్కడే తన మిత్రులతో ఆడుకోవటానికి ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏర్పాటుచేయించారని విమర్శించారు. కేవలం పది నిమిషాల ఢిల్లీ పర్యటనకు ప్రత్యేక విమానం కోసం 90లక్షలు ఖర్చు చేయటం చూస్తూ ఉంటే ప్రభుత్వం తమ జల్సాలలో మునిగితేలుతూ, రాష్ట్ర ప్రజల కీలక సమస్యలను గాలికి వదిలేసిందని స్పష్టమవుతోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్ పాల్గొన్నారు.

## శబరిమలైయాత్రకు కొలన్ శ్రీనివాస్ రెడ్డి గురుస్వామి


ఇరుముడితో బయలుదేరుతున్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి

**నిజాంపేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త** నేటితో అయ్యప్ప స్వామి వారి మండల దీక్ష ను పూర్తిచేసుకుని శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో గణపతి హోమం చేసి సన్నిధానం స్వాములతో కలిసి శబరి యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గోషామహల్‌లో నకిలీ టూల్స్ గుట్టురట్టు

## -లబ్ధి ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసుల దాడి

**గోషామహల్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలోని ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రాలల్లో వ్యాపారులు చేస్తున్నప్పటికి, నకిలి వస్తువులు అమ్ముతూ దొరికితే దొంగ, లేకుంటే దొరగాచలామణిగా అమ్మకాలు చేస్తుంటారు. అలాంటిదే లబ్ధి ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులు దాడులు చేసి అక్రమంగా నకిలి టూల్స్‌ను అమ్మకాలు చేస్తున్న గుట్టును రట్టు చేశారు. ఈదాడులను సౌత్, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బేగంబజార్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు సంయుక్తంగా దాడులు చేసి లబ్ధి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ కాన్వీ టిసిటి సాబ్లేడ్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు దుకాణలపై ఈదాడులు చేపట్టారు. 2019 నుంచే లబ్ధి ఎంటర్‌ప్రైజెస్ కాన్వి నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దీంతో కాన్వీ బ్రాండ్లు, ఆర్థికంగా నష్టం కలగటంతో పాటు, వినియోగదారుల భద్రతకు ముప్పు ఏర్పడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేసి, వీటినిల్యాబ్ పరీక్షలకు పంచించారు. దీని మూలాలు గుర్తించేందుకు ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న వారిని పట్టుకునేందుకుగాను పోలీసులు రంగంలోకి దిగారు. ఇండస్ట్రీరియల్ టూల్స్ నకిలీవి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. నకిలీట టూల్స్ విక్రయాలలో పెద్ద ముఠా ఉందనే కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఇచ్చిన హామీలు కచ్చితంగా అమలు చేస్తాం : మైనంపల్లి


మీడియాతో మాట్లాడుతున్న హన్మంతరావు

**కొంపల్లి, డిసెంబర్ 8, ప్రభాతవార్త** మెదక్ నియోజకవర్గపరిధిలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో మొత్తం 142 గాను 15 గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారని హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2ఏళ్ళు కావస్తోందని, మేము ఇచ్చిన హామీలు మా ఐదేళ్ళ కాలంలో కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉండి, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం అయిన బిఆర్ఎస్ ప్రభుత్వం మాపై సోషల్ మీడియా వేదికగా బురదజల్లుతుందన్నారు. మరో మూడేళ్ళులో మిగిలిన హామీలు నెరవేర్చుతామని, ఈ రోజు ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని అందుకు స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం అయిన నాయకులే నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పడగానే రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ చేపట్టామన్నారు. కాళేశ్వరం నుండి కార్ల స్కాముల వరకు దోపిడీ చేసి, డబుల్ బెడ్ రూమ్లు, ఉద్యోగాలు, దళితులకే పట్టం కడతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నెరవేర్చకపోవడం వల్లనే ప్రజలు మీ ప్రభుత్వన్ని అడ్డు తొలగించారని అన్నారు. పదేళ్లలో 1500 కోట్ల పార్టీ ఫండ్ ను సంపాదించుకుని, వందల వేల ఎకరాల భూములు కొల్లగొట్టి, స్కీముల పేరుతో స్కాములు చేసి, వేల కోట్లు దోచుకున్నారని అన్నారు. మా పని మమ్మల్ని చేసుకోనివ్వండి అభివృద్ధిని అడ్డుకోవాలని, సోషల్ మీడియా ద్వారా ఎన్నో అపోహలు సృష్టించి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొన్ని మీడియా సంస్థలు లేని అపోహలు సృష్టిస్తున్నాయని, రాజకీయ పార్టీలకు సంబంధిచి ఏకపక్షంగా ఉండే మీడియా సంస్థలను బ్యాండ్ చేయాలని కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

## క్రీడలతోనే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం : డా. రమేష్ బాబు


గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో లార్జెస్ట్ కరాటే డిస్ప్లే" టైటిల్ సాధించిన బృందంలో భాగస్వామిగా ఉన్న డాక్టర్ సాతెల్లి గణేష్ ను సత్కరిస్తున్న డాక్టర్ నిమ్మటూరి రమేష్ బాబు

**చిక్కడపల్లి డిసెంబర్ 8 (ప్రభాతవార్త ) :** క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కలుగుతుందని ప్రముఖ విద్యావేత్త, అరోరా విద్యాసంస్థల కార్యదర్శి, ప్రముఖ విద్యావేత్త అధినేత డాక్టర్ నిమ్మటూరి రమేష్ బాబు అన్నారు. తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం చిక్కడపల్లి అరోరా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రాంగణంలో కళాశాలకు చెందిన రసాయన శాస్త్ర విభాగం విద్యార్థి , వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ (భారత దేశం) ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై నగరంలో జరిగిన ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో"లార్జెస్ట్ కరాటే డిస్ప్లే" టైటిల్ సాధించిన బృందంలో భాగస్వామిగా ఉన్న డాక్టర్ సాతెల్లి గణేష్ (ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ బ్యాచ్) విద్యార్థి క్రీడలు, ముఖ్యంగా కరాటే రంగంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ అనేక అరుదైన గౌరవం సాధించి కళాశాలకు పేరును తెచ్చినందుకు సత్కరించి అభినందించారు. దీనితో పాటు ఇన్ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా కరాటే రంగంలో అతి పిన్న వయస్కుడైన గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందారు. కార్యక్రమంలో అరోరా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సి. అజయ్ కుమార్ , వైస్ ప్రిన్సిపాల్ సాయి కృష్ణ , రసాయన శాస్త్ర విభాగాధిపతులు డా. ఎం. శరత్ బాబు అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ వంటి రంగాల్లో దేశ, రాష్ట్ర స్థాయిలో ప్రగతి సాధించడం తమకు గర్వకారణమని అన్నారు. డాక్టర్ గణేష్ సాధించిన ఈ అంతర్జాతీయ పురస్కారాలు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## పరిశ్రమల అభివృద్ధికి ఆధునాతన వ్యూహాలు అవసరం : వేణు కళ్యాణ్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వేణు కళ్యాణ్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధించేందుకు మార్కెటింగ్ విస్తరించడం, సేల్స్ పెంచుకోవడం, టీమ్ రెస్పాన్సిబిలిటీస్, హై పర్ఫార్ టీమ్ నియమించుకోవడం తదితర అంశాలు ప్రధానమైనవని ప్రముఖ వ్యాపార అభివృద్ధి వ్యూహకర్త వేణు కళ్యాణ్ అన్నారు. యునిక్ లైఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో "వ్యాపార రంగంలో ఎలా అభివృద్ధి సాధించాలి? అనే అంశంపై "అల్టిమేట్ బిజినెస్ మాస్టర్" వర్క్ షాప్ సోమవారం నిర్వహించారు. యునిక్ లైఫ్ ఆర్గనైజేషన్ సమన్వయకర్తలు సుశీల్ కుమార్ ఎర్రగుంట్ల, సతీష్ కుమార్ వనపర్తి, అర్చన నేతృత్వంలో జరిగిన ఈ వర్క్ షాప్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సర్వీస్, ఇండస్ట్రీస్, టెక్నికల్, హాస్పిటాలిటీ మానేజ్మెంట్, ఎంఎస్ఎంఈ, రియల్ ఎస్టేట్, నెట్ మార్కెటింగ్, ఇన్సూరెన్స్ తదితర రంగాలకు చెందిన సుమారు 300 మంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు హాజరయ్యారు. ఈసందర్భంగా వేణు కళ్యాణ్ మాట్లాడుతూ వ్యాపార సందేహాలపై, వ్యాపార రంగాల్లో విజయాలు సాధించడానికి సరైన దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా వ్యాపార వృద్ధి వ్యూహాలలో విస్తరించడం, కొత్త సేవలను అభివృద్ధి చేయడం , అమ్మకాలను పెంచడం, వైవిధ్యీకరణ తోపాటు వ్యాపార కార్యకలాపాలు, ఆర్గనైజేషన్ కల్చర్, వాల్యూస్ ఎలా క్రియేట్ చేయాలి తదితర అంశాలపై వేణు కళ్యాణ్ మార్గనిర్దేశం చేశారు. ప్రతిఒక్కరికి అర్థమయ్యే విధంగా పూర్తిగా తెలుగులోనే జరిగిన ఈ వర్క్ షాప్ లో గెస్ట్ స్పీకర్ సంజనాషా, బిజినెస్ లీడర్ షిప్ అంశంపై ఎఫ్.టి.సి.సి.ఐ అధ్యక్షులు ఆర్. రవికుమార్ ప్రసంగించారు.

## సినీ గీతాలలో రాగాల విశేషాల ఏక రాగం దశ సినీ గీతాలు

### -సుప్రసిద్ధ సినీ నేపధ్యగాయని డాక్టర్ శైలజ


గాయని రూపాకుల నాగేశ్వరి రచించిన ఎకరాగందశ సినీ గీతాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ నేపధ్యగాయని డాక్టర్ ఎస్ పీ.శైలజ, చిత్రంలో వంశీ రామరాజు, వోలేటి పార్వతీశం తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** సినీ గీతాలలో రాగాల తెలుసు కోవలసిన విశేషాలు ఎన్నో ఏక రాగం దశ సినీ గీతాలు సంపుటిలో ఉన్నాయి అని సుప్రసిద్ధ సినీ నేపధ్యగాయని డాక్టర్ ఎస్ పీ.శైలజ అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వంశీ ఇంటర్నేషనల్, శ్రీ కృష్ణ స్వర రాగ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి, గాయని రూపాకుల నాగేశ్వరి రచించిన ఎకరాగందశ సినీ గీతాలు గ్రంథావిష్కరణ సభ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగింది. వంశీ సంస్థల అధినేత, కళా బ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, హైదరాబాద్ రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ కె. రజని ప్రియా, నంది అవార్డు గ్రహీత, సినీ నేపధ్య గాయని సురేఖ మూర్తి, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, వంశీ మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ, ఎస్ బి ఐ విశ్రాంత డి జి ఎం గోపికృష్ణ ప్రతాప, స్వరరాగ స్రవంతి వ్యవస్థాపకులు వై.ఎస్.రామకృష్ణ, కోశాధికారి ఎన్.లలిత తదితరులు పాల్గొన్నారు. మంచి పుస్తకం ఉత్తమ నేస్తం ఆత్మ విశ్వాసం ఇస్తుంది అన్నారు విషయ పరిజ్ఞానం కోసం మంచి పుస్తకాలు చదవాలి అన్నారు అటువంటి పుస్తకం ఏక రాగం దశ సినీ గీతాలు అని ప్రతి గ్రంథాలయం లో సంగీత శిక్షణ ఇచే విద్యా లయాలు లో ఉండాలి అని సూచించారు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతంలో సప్త స్వరాలు ఉన్నాయి అని వాటిని అన్వయిస్తూ సినీ గీతాలలో రాగ విశ్లేషణ నాగేశ్వరీ తన సంపుటిలో చేశారు అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వరభారతి అధ్యక్షురాలు ఐ.ఆమంత, ప్రచురణకర్త, రచయిత్రి జ్యోతి వల్లభోజులను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తెలుగు పాటకు పట్టాభిషేకం పేరుతో వై ఎస్ రామ కృష్ణ లలిత బృందం సుంకర పల్లి శైలజ నిర్వాహణ లో పలు సినిమాల్లో పాటలు ఆలపించారు.

# ఏఐ మానవ వనరుల్ని తగ్గిస్తుంది

### -పూర్తిగా తొలగించేస్తారన్నది వాస్తవం కాదు
### -ఏఐ నిపుణలు ఉడుముల సుధాకర్‌రెడ్డి


ప్రెస్‌క్లబ్‌లో జరిగిన వర్క్‌షాప్‌కు హాజరైన జర్నలిస్టులు

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** ప్రస్తుతం ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తున్న, అనుసరిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానవ వనరుల వినియోగాన్ని పూర్తిగా తొలగిస్తుందన్నది వాస్తవం కాదని సీనియర్ జర్నలిస్టు, ఏఐ నిపుణుడు ఉడుముల సుధాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమాజీగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, ఏఐ ఫర్ డిజిటల్ రెడీనెస్ అండ్ అడ్వాన్స్‌మెంట్ (ఏడీఐఆర్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో పాత్రికేయుల కోసం సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ వినియోగం కారణంగా మానవ వనరుల వినియోగం తగ్గుతుందని, ఇది మానవాళికి ఓ సహాయకారి మాత్రమే అవుతుందని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. డేటా సెట్స్, వెబ్‌సైట్లలో ఉన్న సమాచారమే ఏఐ ద్వారా మనకు అందుతుందని, ఈ కారణంగానే సమాజంలో ఉన్న వివక్ష మొత్తం అందులో కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరికీ దీన్ని నివారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఏఐ వినియోగం నేపథ్యంలో మిస్ ఇన్ఫర్మేషన్, డిస్ ఇన్ఫర్మేషన్‌లను అధిగమించాల్సి ఉంటుందని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఏ స్థాయిలో అభివృద్ధి చెందినా ఒరిజినల్ థింకర్స్, ఒరిజినల్ రైటర్స్‌కు ఎలాంటి ఇబ్బంది రాదని స్పష్టం చేశారు. మానవాళికి సవాల్ విసురుతున్న డీప్ ఫేక్‌ను కనిపెట్టడానికి అనేక వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి జర్నలిస్టూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉంది. ఇందులో ఏఐ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. ఆఉద్దేశంతోనే పాత్రికేయుల్లో ఏఐ వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికే ఈ వర్క్‌షాపు ఏర్పాటు చేశాం అని పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 80 మంది జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ జనరల్ సెక్రటరీ వరికుప్పల రమేష్, కోశాధికారి రమేష్ వైట్లలతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుహాజరయ్యారు.

## పెండింగ్‌లో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అధ్యాపకులు

**తార్నాక, డిసెంబర్ 8 ప్రభాతవార్త :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని కోరుతూ సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి పరిపాలనా భవన్ లో రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెందర్ కుమార్ నాయక్‌లను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఓయూ కు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనంగా స్వాగతిస్తామని ఈ సందర్భంగా ఓయూ అధ్యాపకులు ప్రకటించారు. గత ఏడాది కాలంగా ఓయూలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్య, పరిశోధనల్లో ఘనసీయమైన పురోగతి సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఓయూను మరో వందేళ్ల పురోభివృద్ధి దిశగా గౌరవ ఉపకులపతి ఆచార్య కుమార్ నేతృత్వంలో తీసుకెళ్లేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని.... ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావటం ఓయూ చరిత్రలోనే గొప్ప విషయంగా అభివర్ణించారు. ఇప్పటికే అధ్యాపకులకు రావాల్సిన ఎరియర్స్ సహా చాలా సమస్యలను పరిష్కరించారని.... కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ అమలు చేయటం ద్వారా తమ పదవీవిరమణ తర్వాత ఆర్థిక భద్రత ఉంటుందని వివరించారు. ఓయూను అంతర్జాతీయ విద్యాకేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ నేతృత్వంలో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుతామని స్పష్టం చేశారు. 20 ఏళ్లుగా సీపీఎస్ లేకపోవటం వల్ల ఎంతో ఇబ్బంది ఎదుర్కొన్నామని ప్రొఫెసర్ కుమార్ గారు చొరవ తీసుకుని అమలు చేయించాలని ఈ సందర్భంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పి. చంద్రశేఖర్, నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, యూజీసీ డీన్ ప్రొఫసర్ లావణ్య, ప్రొఫెసర్ మల్లేశం, ప్రొఫెసర్ వెంకట లక్ష్మి, డాక్టర్ కొండా నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. వినతి పత్రం స్వీకరించిన అనంతరం సెనెట్ హాల్లో అధ్యాపకులను ఉద్దేశించి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితెందర్ కుమార్ నాయక్ లు అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు బోధన, బోధనేతర ఉద్యోగులు అడగక ముందే చాలా సమస్యలను ఉపకులపతి ఆచార్య కుమార్ పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎరియర్స్, సీఏఎస్, బోధన, బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారని వివరించారు. క్యూఎస్ వరల్ట్ ర్యాంకింగ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో పురోగతి సాధించామని అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఓయూ రూపురేఖలే మారబోతున్నాయని భవిష్యత్తులోనూ ఓయూలో ప్రశాంత విద్య, పరిశోధన వాతావరణం, సుహృదభావ వాతావరణాన్ని నిలకొల్పేందుకు ఉపకులపతి చొరవ చూపబోతున్నారని గుర్తు చేశారు. బోధన, పరిశోధనల్లో పురోగతిని వివరించారు. సీపీఎస్ సమస్య పరిష్కరించేందుకు వీసీ సానుకూలంగా ఉన్నారని... వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,

## ఎస్‌జిఎఫ్ఐ బాస్కెట్‌బాల్ పోటీల్లో బాలికల టీం గెలుపు


పోటీల్లో గెలుపొందిన బాలికల టీం

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో డిసెంబర్ 5 వ తేదీ నుండి 7 వ తేదీ వరకు నిర్మల హైస్కూల్లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ అండర్ 19 బాస్కెట్ బాల్ పోటీలలో నగరానికి చెందిన బాలికల టీమ్ ఫైనల్ విజేతగా నిలిచి కప్ ను కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా నానక్‌రాంగూడలో గల శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ నుండి ప్రాతినిధ్యం వహించిన టీమ్ కెప్టెన్ లక్ష్య రెడ్డి మందడి అత్యంత ప్రతిభ కనపరచి జట్టు విజయం లో కీలక పాత్ర పోషించారు. ఈసందర్భంగా విజేతలకు ట్రోఫీ ని ప్రధానం చేశారు.

## 9న బిఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీ మహేందర్ కుమార్ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్

**అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 8ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కెసిఆర్ చేసిన దీక్షతో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటన ఎంతో దోహదపడిందని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్ కుమార్ అన్నారు. కోఠిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేది తెలంగాణ విజయ్ దివస్‌గా వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని మాజీ కార్పొరేటర్లు, ఉద్యమ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి డిసెంబర్9వ తేదిన మంగళవారం కోఠి ఆంధ్రబ్యాంకుచౌరస్తా, అబిడ్స్ చౌరస్తా, ఎంజె మార్కెట్‌చౌరస్తా, నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల్లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రసిద్ధ నాటక సినీ రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతం

### ...మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహ రెడ్డి


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహా రెడ్డి

**చిక్కడపల్లి డిసెంబర్ 8 (ప్రభాతవార్త ) :** కవిగా. నాటక రచయితగా సినీ రచయితగా బలిజేపల్లి లక్ష్మీకాంతం సుప్రసిద్ధులని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహ రెడ్డి గుర్తు చేశారు . అయన రచించిన సత్య హరిశ్చంద్ర నాటకం ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాలు లో ప్రదర్శిస్తూ వున్నారని చెప్పారు. సోమవారం శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సంగీత నాట్య వేదిక పై గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంతం యాది లో పేరిట సమావేశం జరిగింది. నంద్యాల నరసింహ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమం లో గాంధీజీ పిలుపు మేర పాల్గొన్న బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి సినీ రంగం లోనూ కథా రచయితగా నటుడు గానూ గుర్తింపు పొందారని వివరించారు. మరుగున పడిపోతున్న బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి గురించి తెలుసుకోవటం నేటి వారికి అవసరమని, ఇందువల్ల తెలుగు భాష దేశ సంస్కృతి సంప్రదాయాలు అవగతం అవుతుందని చెప్పారు. కళా పోషకులు కేతురాజు పూర్ణిమ కామేశ్వర రావు, గానసభ పాలకమండలి సభ్యులు గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## కుల్సుంపురా సిఐ సునీల్ సస్పెండ్

**జియాగూడ, డిసెంబర్ 8ప్రభాతవార్త:** కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలోని సిఐ కొర్ని సునీల్‌పై నగర పోలీస్ కమీషనర్ వి.సి సజ్జన్నార్ సస్పెషన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళ్లితే సదరు కుల్సుంపురా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ ఓ కేసుల్లో నిందితుల పేర్లు మార్చి వారికి అనుకూలంగా కేసు చేశారనే ఆరోపణలు రావడంతో నగర పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనార్ సిఐనిసస్పెండ్ చేశారు. నిందితుల దగ్గర నుంచి డబ్బులు తీసుకుని పేర్లు మార్చారని అంతర్గత విచారణలో తేలడంతో సునీల్‌పై చర్యలు తీసుకున్నారని కుల్సుంపురా ఎసిపి మునావర్ తెలిపారు. కుల్సుంపురా ఎసిపి పరిధిలోని రెండు నెలలలోపు టప్పాచబుత్రా, కుల్సుంపురా పోలీస్‌స్టేషన్లఇన్‌స్పెక్టర్లును అవినీతి ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేయడం పట్ల నగరంలోని ఇన్‌స్పెక్టర్లువణుకు పుడుతుంది. అసలు ఉద్యోగం చేయాలంటే జడుసుకుంటున్నారు. టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్ ఇటీవల సస్పెండ్ చేశారు.

## సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలి

**లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు పవన్ కుమార్ గౌడ్**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌గౌడ్, బాలరాజుయాదవ్, శైలేందర్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిల్ కార్పొరేషన్లో సికింద్రాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. 200ఏండ్లకు పైగా చరిత్రలో ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 150 డివిజన్లు గా ఉన్న గ్రేటర్ మున్సిపాలిటీలో 20 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లను విలీనం చేయడం 300 పై చిలుకు డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే అభివృద్ధిలో అమాదదూరంలో ఉన్న గ్రేటర్ ఈనిర్ణయంతో మరింత వెనుకబాటుకు గురవుతుందన్నారు. ప్రభుత్వం విలీనం చేయాలనుకుంటే అంతకు ముందే సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి, ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు. తద్వారా ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు యాదవ్, ఉపాధ్యక్షులు ఎ.. శైలేందర్, సహాయ కర్యాదర్శి సీహెచ్ సునీల్ కుమార్, కోశాధికారి అబ్దుల్ అజీజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

## 11న నిరుద్యోగులకు మెగాజాబ్ మేళా

### -దినకర్ రెడ్డి వెల్లడి

**చిక్కడపల్లి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** ముషీరాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 11వ తేదీన ముషీరాబాద్ నియోజకవర్గంలోని హెరిటేజ్ ప్యాలెస్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంఘ సేవకులు టీ దినకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఐటిఐ, డిప్లమా, బీటెక్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ మరియు ఇతర పీజీ కోర్సులు చేసిన యువతీ యువకులు ఈ ఉద్యోగ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సూచించారు. ఈ జాబ్ మేళాలో పేరుపొందిన ఐటీ, సాఫ్ట్వేర్, బ్యాంక్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, ఫార్మసీ, ఇంజనీరింగ్, హాస్పిటల్, హోటల్ రంగాలకు చెందిన కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. అర్హత కలిగిన వారందరికీ ఉద్యోగాలు ఇచ్చే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులందరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దినకర్ రెడ్డి కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నెంబర్ 8374 31 5052 లో సంప్రదించాలని కోరారు

## ప్రభుత్వ ఆసుపత్రుల విద్యుత్ బకాయిలు రూ.2 కోట్ల పది లక్షలు

**చార్మినార్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రెండు కోట్ల పది లక్షల రూపాయల విద్యుత్ బకాయిలు టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్, మొగల్‌పుర విద్యుత్ సెక్షన్‌లకు రావ లసి ఉంది. దాదాపు సంవత్సరం నుంచి ప్రభుత్వ ఆసుపత్రులు విద్యుత్ బకాయిలు చెల్లించక పోవటంతో విద్యుత్ బకాయిలు పెరిగిపోతున్నాయి. టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ అసిస్టెంట్ డివిజనల్ పరిధిలో ఉన్న సూరజ్ భాను ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి 20 లక్షల రూపాయలు, చార్మినార్ యునానీ ప్రభుత్వ ఆసుపత్రి 45 లక్షల రూపాయలు, సిటి కళాశాల సమీపంలోని పెట్లా బూర్జు ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుపత్రి కోటి 45 లక్షల రూపాయలు విద్యుత్ బకాయిలు చెల్లించ వలసి ఉంది. విద్యుత్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించక పోవటంతో విద్యుత్ బకాయిలు పెరిగి పోతుతున్నట్లు తెలిసింది..

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత


సెల్ ఫోన్లు అందజేస్తున్న ఫలక్‌నుమా సిఐ సీతయ్య

**చార్మినార్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** పాతబస్తీ ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఇరవై మంది సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. పోగొట్టుకున్న ఇరవై సెల్ ఫోన్లు లభించటంతో సోమవారం ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ సీతయ్య సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఇరవై మందికి సెల్ ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐ జాకీర్ హుస్సేన్, ఎస్ఐలు మహేష్, హసీనా పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే అధికారులు : ఎమ్మెల్యే శ్రీగణేష్



2వ వార్డు గన్ కంటోన్మెంట్ వాణి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబర్ 8 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రజల వద్దకే అధికారులు కంటోన్మెంట్ వాణిని ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఈ నెల 10వ తేదీన 2వ వార్డు రసూల్ పురా గన్ బజార్‌లోని కమ్యూనిటీ హాల్‌లో వాణి కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా సోమవారం ఆయన అ ప్రాంతాన్నీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తులను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన రెవెన్యూ, విద్యుత్, సివిల్ సప్లయ్, పోలీస్, పారెస్ట్, ట్రాఫిక్ వంటి వివిధ విభాగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవిందర్ ద్వివేతి, హెల్త్,శానిటేషన్, ఇంజనీరింగ్, వాటర్ విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ వాణి కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పేద విద్యా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : కావ్యరెడ్డి



అడ్డగుట్ట ప్రభుత్వ హై స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య రెడ్డి

**అడ్డగుట్ట,డిసెంబర్ 8 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, అటు వంటి వారికి ఎల్లప్పుడు తమ హాయ సహకారాలు ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య రెడ్డి తెలిపారు. సోమవారం అడ్డగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అందులో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్,లైబ్రేరీని ఆమెప్రారంభించారు. అదే విధంగా 2025..26 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్ష రాయబోతున్న విద్యార్థులందరికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జీతం, తన సొంత నిధి ద్వారా బోర్డు పరీక్ష ఫీజు రుసుము చెక్కు రూపంలో ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కావ్య రెడ్డి మాట్లాడుతూ అడ్డగుట్ట అడ్డగుట్ట ప్రభుత్వ హై స్కూల్‌లో చదువుతున్న 96 మంది విద్యార్థులకు 10వ తరగతి పరీక్షఫీజును చెల్లించడంతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 5 వేల మంది విద్యార్థులకు కిషన్ రెడ్డి నిధి నుంచి పరీక్ష ఫీజులు చెల్లి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, అడ్డగుట్ట బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య, నాయకులు సి.హెచ్.కన్నాభిరామ్,గెల్లు ఉదయ్ యాదవ్, నరేందర్, చారి, వేణు, వీరేశం, శివాజీ, శ్యామల, శారదమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి కృషి : సిఈఓ అరవింద్



కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ

**కంటోన్మెంట్,డిసెంబర్ 8 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి చిన్నతోకట్ట లోని జీఎం అంజయ్య హిందూ స్మశాన వాటిక స్థలాన్నీ పరిరక్షించడంతో అందులో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరుతూ సోమవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేదికి స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సిఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండల్ యాదవ్, అశోక్, విజయ్, ఇటుక గోపి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అభివృద్ధి వేగవంతం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వి. హనుమంతరావు తదితరులు

**సికింద్రాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అంతకు ముందు చిలకలగూడ నుంచి సీతాఫల్‌మండి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. గత రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి, హామీల అమలులో అనేక కీలక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సంక్షేమం, పారదర్శక పాలన. రైతుల కోసం రూ. 15వేల రైతు భరోసా, పంట బీమా, పేదలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలం, ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు, భర్తీ ప్రక్రియ వేగవంతం చేయడం లాంటి అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు జరుగుతున్నాయన్నారు. రానున్న మూడేళ్లలో మరిన్ని ప్రజా ప్రయోజన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి 2047 విజన్‌ను లక్ష్యంగా పెట్టుకొని కార్యచరణతో పాలన సాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, నేతలు సందీప్ రాజ్, సృజన కుమార్, జలంధర్ రెడ్డి, అనిల్, సీనియర్ నాయకుడు షకీల్‌ఖాన్, వహీద్, గంట రాజు సాగర్ పాల్గొన్నారు.

## అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** సనత్ నగర్‌లోని బికెగూడలో సోమవారం నీరుడు కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరైయ్యారు. స్వామి వారికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూజలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కురుణాకర్ రెడ్డి, ఖలీల్,పీయూష్ గుప్తా, శుక్లా, ప్రదీప్ గౌడ్,సాయి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికంగా సమస్యలుంటే నా దృష్టికి తీసుకు రండి

### -బస్తీ బాట కార్యక్రమంలో కార్పోరేటర్



బస్తీబాట కార్యక్రమంలో కార్పోరేటర్ చీరె సుచిత్ర.

**బేగంపేట డిశంబరు 8,ప్రభాతవార్త**

డివిజన్ లో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ అన్నారు.ప్రజల సమస్యలు తెల్సుకునేందుకు రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ బస్తీ బాట పట్టారు.సోమవారం డివిజన్ పరిధిలోని బాపు బాగ్ విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు వివిధ శాఖల అధికారులు,పోలీసులు,స్థానిక మహిళలతో కల్సి బాపూ బాగ్ కాలనీ రెండు గంటల పాటు పర్యటించారు. బస్తీబాట నిర్వహించారు.ముఖ్యంగా కాలనీలో రోడ్లపై వాహనాలు నిలుపుతున్నారని,అలాగే రాత్రి వేళల్లో మందుబాబుల బెడద ఉందని,మహిళలు కార్పోరేటర్ దృష్టికి తీసుకు రాగా వెంటనే స్పందించిన ఆమె స్థానిక పోలీసు ఇన్స్‌పెక్టర్ నర్సింగ్ రావుకు చర్యలు తీసుకోవాలంటూ సూచించారు.మూడు చోట్ల నుంచి డ్రైనేజీ పొంగుతుందని,జలమండలి అధికారి ఆశిష్ దృష్టికి తీసికెళ్లారు. వెంటనే ఆ సమస్యకు మోక్షం కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.కాలనీలో లోవోల్టేజీ సమస్య ఉందని, ఎలక్ట్రికల్ అధికారులు దుర్గా ప్రసాద్ ,శివరామ్ కు చెప్పారు.అంతర్గత రోడ్ల కోసం ఏఈ శివరామ్ ప్రసాద్ 40 లక్షల ఫండ్ కు ప్రతిపాదనలు పెట్టారు.అలాగే దారి పొడవునా చెట్లు వంగి ఉన్నాయని వాటి కొమ్మలను తొలగించాలని,హార్టికల్చర్ అధికారి సత్యనారాయణ చెప్పారు.కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, శానిటేషన్ సిబ్బందికి చెప్పారు.వీధి దీపాల సమస్య ఉందని వెంటనే కొత్తలైట్లు వేయాలని సంబంధిత అధికారి సాగర్‌కు తెలియజేసారు.అనంతరం కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కాలంలో తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరించామని,ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని కార్పోరేటర్ కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీరె శ్రీకాంత్,పెద్ద సంఖ్యలో మహిళలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## లింగ సమానత్వంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాలి

### -దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ డిమాండ్

**సైఫాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా లింగ సమానత్వం కోసం జరిగే ప్రచారోద్యమం మన దేశంలో చాలా అవసరమని స్త్రీలు, బాలికలపై జరిగే హింసను రూపుమాపడమే తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వాలు దృష్టిని సారించాలని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ డిమాండ్ చేశారు. ఐక్య రాజ్య సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఏడాది ఈ ప్రచారోద్యమానికి డిజిటల్ హింసను అంతమొందిద్దాం అనే నినాదం ఇవ్వడం జరిగిందని, అంటే డిజిటల్ హింస అంత దారుణంగా పెరిగిందన్నారు. ఐక్య రాజ్య సమితి పిలుపులో భాగంగా నవంబరు 25వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఈ ప్రచారోద్యమాన్ని దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. సోమవారం నాడిక్కడ జరిగిన అమ్మాయిల ప్రచారోద్యమ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత ప్రేమ పేరుతో అమ్మాయిలను పోటోలు తీసి తరవాత మార్ఫింగ్ చేసి ఆ పోటోలను నగ్నంగా చూపించి వశపరుచుకోవడం సోషల్ మీడియా ద్వారా రుణాలు ఇస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని అనేక చేడు పరిష్కృతుల వైపు ప్రయోగిస్తున్నారని ఆమె ఆరోపించారు. వీటిపై అవగాహనతో నడుచుకోవాలని ఆమె సూచించారు. కుటుంబంలోనే మొదటి హింస ప్రారంభమవుతుందని కుటుంబంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ప్రదానమైనదని దాని ద్వారానే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. చిన్న, చిన్న గోడవులతో జీవితాలన నాశనం చేసుకోవద్దని ఫోక్సో చట్టం గురించి ఆమె వివరించారు. విద్యార్థులు చైతన్యవంతమై తల్లిదండ్రుల స్థితిగతులను మార్చాలని కోరారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలని, అద్యాపకుల బృందం దళిత స్త్రీ శక్తి బృందానికి ఘనంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి కో-ఆర్డినేటర్లు సత్య, జాబిలి, బురహన్,శివ తదితరులు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్ సాధించుకుంటాం : ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** తెలంగాణ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కంచిగారి ప్రవీణ్‌కుమార్ నియమితులైనారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి గవ్వల భరత్‌కుమార్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత తూ తూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుందని ఆరోపించారు. ఆర్.కృష్ణయ్య సారధ్యంలోనే బిసి రిజర్వేషన్‌లు సాధించుకుంటామని ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా పడిపూజ



అయ్యప్ప పూజలో పాల్గొన్న బండి రమేష్

**కూకట్‌పల్లి, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** శివశంకర్, నరసింహ ఆధ్వర్యంలో మూసాపేట్‌లో సోమవారం శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తూము వేణు, అశోక్, శంకర్ కొండల్ రెడ్డి, శీను పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే మాధవరం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** బాలానగర్ డివిజన్ ఇందిరా నగర్‌లో నూతన పైప్ లైన్ పనులు వాటర్ వర్క్స్ అధికారులు నిర్మాణం చేస్తున్న సందర్భంగా ఐడిపిఎల్ అధికారులు పనులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో వెంటనే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ ప్రాంతానికి వెళ్ళి ఎట్టిపరిస్థితుల్లో పనులు ఆపడానికి లేదని ఇదంతా కూడా ఐడిపిఎల్‌కు సంబంధించిన భూమి కాదని ఇప్పటికే ఇక్కడ డ్రైనేజ్ కరెంట్ లైన్లు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఎంతో మంది నిరుపేదలు దాదాపు 70 ఏళ్ల నుంచి ఇక్కడ నివసిస్తున్న ఈ ప్రాంతంలో పనులు ఎలా అడ్డుకుంటారని దాదాపు 4 గంటలు అక్కడే బైఠాయించి పనులు ఆపేదిలేదని ఒకవేళ పనులు ఆపితే ఇక్కడే కూర్చుంటానని తేల్చి చెప్పడంతో పోలీస్ అధికారులు సర్ది చెప్పడంతో సంయమనం పాటించారు. అనంతరం వాటర్ వర్క్స్ అధికారులు పనులు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ దాదాపు 70 ఏళ్ల నుంచి ఇక్కడ నివసిస్తున్న నిరుపేదలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని పెండింగ్‌లో ఉన్న పనులు కూడా పూర్తి చేయాలని సంకల్పించుకున్నాం అని ఇలా ఐడిపిఎల్ అధికారులు పనులు అడ్డుకుంటే నిరుపేదలను కాపాడుకోవడానికి దైనికైన సిద్ధం అని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 ప్రారంభం



స్మార్ట్ ఇండియా హాకథాన్‌లో పాల్గొన్న ప్రముఖులు సీతారాం, నిఖిల్‌కాంత్, సందీప్‌శుక్లా, సచిన్ అగర్వాల్, పూర్ణచందర్, రాజేందర్ కృష్ణచైతన్య

**నాంపల్లి, డిసెంబరు 8 ప్రభాతవార్త :** మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ -ఎఐసిటిఇ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద హ్యాకథాన్‌లలో ఒకటైన స్మార్ట్ ఇండియా హాకథాన్ 2025 సోమవారం వైభవంగా ప్రారంభమైంది. వర్చువల్ ఆరంభ కార్యక్రమానికి ఎఐసిటిఇ ఛైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం ప్రధాన అతిథి కాగా, స్థానిక భౌతిక కార్యక్రమానికి ఎఐసిటిఇ డిప్యూటీ డైరెక్టర్ డా. నిఖిల్‌కాంత్ హాజరయ్యారు. ఈ హ్యాకథాన్‌లో దేశంలోని 727 సంస్థలకు చెందిన 8,160మంది పైనలిస్టులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ టి.జి.సీతారాం మాట్లాడుతూ విద్యార్థులే దేశ నిర్మాతలన్నారు. ఈ వేదిక యువ ఇన్నోవేటర్లకు ప్రజాసేవా సమస్యల పరిష్కారం చేయడానికి ఒక గొప్ప అవకాశమన్నారు. డా. నిఖిల్‌కాంత్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎస్ఐహెచ్ కోసం మొత్తం అయిదు నోడల్ సెంటర్లు ఉండడం విశేషమన్నారు. హైదరాబాద్ నగరం దేశంలోనే ఒక పెద్ద ప్రధాన ఇన్నోవేషన్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ డా. సందీప్‌శుక్లా, డా. సచిన్ అగర్వాల్, జి.పూర్ణచందర్, డా. రాజేందర్, ప్రొఫెసర్ కృష్ణచైతన్య జగపతి తదితరులు పాల్గొన్నారు.

## గురువులపైనే గురుతర బాధ్యత

### : రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య



రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కోల ఈశ్వరయ్యను సత్కరిస్తున్న కోల రవిందర్‌ముదిరాజ్, కోల వెంకటేశ్ ముదిరాజ్

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 8 ప్రభాతవార్త**

సమాజం తప్పుదోవపట్టకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవర్చే బృహత్తర బాధ్యత ఉపాధ్యాయులు, సంఘ సేవకులదేనని ప్రభుత్వ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కోల ఈశ్వరయ్య అన్నారు. తన 85వ జన్మదిన వేడుకలు సూరారంలోని ఓ ఫంక్షన్‌హాలులో తన తమ్ముడు కోల వెంకటేష్‌ముదిరాజ్‌తో కలసి సంఘ సేవకులు, పర్యావరణవేత్త కోల రవిందర్‌ముదిరాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి కోల ఈశ్వరయ్య మాట్లాడుతూ శాలువాలు, సత్కారాలకన్నా అపదలో ఉన్నవవారివద్దకు వెళ్ళేప్పుడు వారిస్థితిగతులతో సంబందంలేకుండా తోచినవిధంగా ఆర్థికమద్దతు, సమయం కేటాయించడంద్వారా వారు త్వరగా కోలుకుంటారని సూచించారు. తనకొడుకులు పర్యావరణవేత్తగానో, ఉపాధ్యాయుడుగానో ఉన్నారన్న తృప్తికన్నా సమాజానికి ఏస్థాయిలో ఉపయోగ పడుతున్నారనేదే సంతృప్తిని ఇస్తుందన్నారు. అనంతరం ఇద్దరు కుమారులు కోల రవిందర్‌ముదిరాజ్, కోలా వెంకటేష్‌ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో జరిగిన తులాబారంలో వచ్చిన వ్యయాన్ని అనాథ ఆశ్రమాలకు దానంచేసేందుకు నిర్ణయించినట్లు 85ఏళ్ల రిటైర్డ్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు కోలా ఈశ్వరయ్య ముదిరాజ్ తెలిపారు.

## త్వరలో సిసి రోడ్ల నిర్మాణం జరుపుతాం



గుర్రం పవన్‌కుమార్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కాలనీ వాసులు

**సికింద్రాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** పద్మారావునగర్‌లోని ఈశ్వరమ్మ బస్తీలో కార్పొరేటర్ నిధుల నుండి రూ. 1కోటి రూపాయల ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు నాయకులు సోమవారం ఈ ప్రాంతంలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు బాగా దెబ్బ తిన్నాయని, ఈ ప్రాంతంలో నూతన రోడ్డు ఏర్పాటు చేయాలనీ స్థానికుల డిమాండ్ మేరకు ఇటీవల కేటాంచిన కార్పొరేటర్ నిధుల నుండి కోటి రూపాయలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని పవన్ కుమార్ గౌడ్ స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ సానిటరీ సూపర్‌వైజర్ ధనగౌడ్, వాటర్ వర్క్స్ ఏఈ నవ్య, స్ట్రీట్ లైట్స్ శ్రీకాంత్ బీఆర్ఎస్ నాయకులు ముక్క శ్రీనివాస్, అంబులెన్సు సురేష్, రవి, మహేందర్ గౌడ్, శ్రీరాములు, నాగ లక్ష్మి, హరి చారీ, వినోద్‌లు పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ మీద ఉన్న చిత్తశుద్ధి రిజర్వేషన్లపై ఎందుకు లేదు




చిక్కడపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాలగౌని బాలరాజ్ గౌడ్

**హైదరాబాద్ డిసెంబరు8,ప్రభాతవార్త :** రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ మీద ఉన్న చిత్త శుద్ధి బీసీ రిజర్వేషన్ల పైన ఎందుకు లేదని బీసీ పొలిటికల్ ఫ్రంట్ ప్రశ్నించింది. సోమవారం చిక్కడపల్లిలోని పొలిటికల్ ఫ్రంట్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఛైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, వైస్ ఛైర్మన్ సుగురి దుర్గయ్య గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్లు మాట్లాడుతూ... తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ మీద ఉన్న చిత్త శుద్ధి బీసీ రిజర్వేషన్ల పైన చూపి ఉంటే ఇప్పటికే పార్లమెంట్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత వచ్చేదని వారు మండిపడ్డారు. రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీలను డిప్యూటీ సీఎం పార్లమెంట్ సభ్యులతో వెళ్లి ఆహ్వానించారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రస్తావించకుండా ప్రధాన మంత్రి అపాయింట్మెంట్ ఇవ్వలేదని అబద్ధాలు చెప్పడం సరైంది కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్లో మద్దతు కోసం ఎందుకు పంపించలేదో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశాన్ని పక్కదారి పట్టించడానికే స్థానిక సంస్థల ఎన్నికలు తీసుకొచ్చారని విమర్శించారు. విద్య, వైద్యంతోపాటు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల వల్ల రంగారెడ్డి హైదరాబాద్ లో పచ్చదనాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లు తీసుకొచ్చే వరకు రాజీలేని పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ అంబాల నారాయణ గౌడ్, బోయ గోపి, వి. నాగభూషణం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 23వరకు "టిటిఏ సేవాడేస్-2025"



కార్యక్రమ పోస్టర్ విడుదల చేస్తున్న టిటిఏ ప్రతినిధులు

**హైదరాబాద్,డిసెంబరు 8,ప్రభాతవార్త:** తెలుగు కళల తోట.. తెలంగాణ సేవల కోట.. అంటూ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను అమెరికాలో ఘనంగా నిలబెడుతున్న తెలంగాణ అమెరికా తెలుగు సంఘం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో "సేవాడేస్ 2025" కార్యక్రమాలను ప్రారంభిస్తోంది.ఈ టిటిఏ సేవాడేస్ 2025 డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 23 వరకు తెలంగాణ జిల్లాల్లో నిర్వహిస్తారు. డిసెంబర్ 14న గచ్చిబౌలిలో "10కె రన్"తో డ్రగ్స్‌పై భారీ స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. డిసెంబర్ 25న టిటిఏ 10వ వార్షికోత్సవ వేడుకలు జరుపుతారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీటీఏ నాయకులు వివరాలు తెలిపారు. ఏటా నిర్వహించే ఈ సేవాడేస్‌లో భాగంగా ఆరోగ్యం, విద్య, సమాజ అభివృద్ధి, యువత అవగాహనా కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నివారణపై చైతన్యం, రక్తదానం, ఆహార పంపిణీ, గిరిజన ప్రాంతాలకు మద్దతు.. వంటి 40కి పైగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. ఈ సేవ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, జనగామ, నల్లగొండ, యాదాద్రితో పాటు మరిన్ని జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమాల్లో టిటిఏ ఫౌండర్ పైల మల్లారెడ్డి, ప్రెసిడెంట్ నవీన్ మల్లిపెద్ది, ఏసీచైర్ విజయపాల్ రెడ్డి, ఏసీకో చైర్ మోహన్ రెడ్డి పటోళ్ల,సేవాడేస్ సలహాదారు డా. ద్వారకానాథ్ రెడ్డి, కన్వెన్షన్ 2026 చైర్ ప్రవీణ్ చింతా, 10వ వార్షికోత్సవ చైర్ డిఎల్ఎన్ రెడ్డి, జాయింట్ ట్రెజరర్ స్వాతి చెన్నూరి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ జ్యోతి రెడ్డి దూదిపాల, రమా కుమారి వనమా,నర్సింహ పెరుక, సేవాడేస్ కోఆర్డినేటర్ విశ్వ కంది, 10వ వార్షికోత్సవ వేడుక కల్చరల్ చైర్ డా. వాణి గడ్డం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, వాలంటీర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు

# వి లిక్కర్‌మార్ట్ వైన్‌షాప్‌ను ఎత్తివేయాలని బిజెపి ఆందోళన



కైసర్‌నగర్ ప్రధానరోడ్డుపైగల ఆక్సిజన్ అపార్ట్‌మెంట్ ముందు ఏర్పాటుచేసే వి లిక్కర్‌మార్ట్‌ను తొలగించాలని గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్న బిజెపి నాయకులు ఆకుల సతీష్, నల్ల జైశంకర్‌గౌడ్ తదితరులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 8 ప్రభాతవార్త**

కొత్త వైన్‌షాపుల ఏర్పాటులో నిర్వాహకుల అత్యుత్సాహానికి అధికారుల మద్దతు తోడవడంతో ప్రజాప్రయోజనాలు గాలిలో కలుస్తున్నాయి. ఇదేతంతు కుత్బుల్లాపూర్ మండలంలో ఒక అడుగుముంకేసి ప్రధానరోడ్లపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతంలో వైన్‌షాపుల నిర్వాహణ ఆందోళన కరంగా మారిందని భారతీయ జనతాపార్టీ నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ కార్యాలయం ముందు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకులు ఆకుల సతీష్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు.గండిమైసమ్మ బౌరంపేట్ నుండి కైసర్‌నగర్‌కు వెళ్లే ప్రధానరహదారిపై విచ్చలవిడిగా ట్రాఫిక్‌రద్దీ ఉన్నప్రాంతాన్ని సదరు వైన్‌షాపు యజమానులు కొత్తషాపుల ఏర్పాటుకు నిర్ణయించడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఇక్కడ వైన్‌షాప్ ఏర్పాటుచేస్తే ప్రయాణికులు, మందుబాబులు ప్రమాదాలకు గురవుతారని గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చిన గాజులరామారం ఉపకమీషనర్ ఇష్టానుసారంగా మందుదుకాణానికి అనుమతి ఇవ్వడంవెనక రాజకీయ వత్తిళ్ల ఉన్నాయని బిజెపి ఆరోపించింది. కైసర్‌నగర్ గండిమైసమ్మరోడ్డుపై స్థానిక శాసనసభుడి అనుచరులు వి లిక్కర్‌మార్ట్ ఏర్పాటుకోసం రోడ్డు బఫర్‌జోన్‌ను ఆక్రమించి దాదాపు 12 అక్రమషెడ్లను నిర్మించినప్పటికీ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ తోపాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టకపోవడం బిజెపి నేతలు ఆందోళన నిర్వహించారు. ఆక్సిజన్‌హోమ్స్ అపార్ట్‌మెంట్ 60ఫీట్ల రోడ్డును 30ఫీట్లకు కుదించి ఫుట్‌పాత్‌ను ఆక్రమించాలని వారు ఆరోపించారు. వెంటనే చర్యలు ప్రారంభించి వైన్‌షాపు ప్రారంభాన్ని నివారించాలని విజ్ఞప్తిచేశారు. ఆందోళనలో ఆకుల సతీష్, నల్ల జైశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## దోపిడికి పాల్పడ్డ నేపాల్ ముఠా అరెస్టు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టాస్క్ పోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

**కంటోన్మెంట్,డిసెంబర్ 8 ప్రభాతవార్త:** ఆర్మీ రిటైర్డ్ అధికారిపై దాడి చేసి బంగారు అభరణాలు,నగదును ఎత్తుకెళ్లిన కేసులో నేపాల్ గ్యాంగ్‌ను కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకొని 5 గురిని అదుపులోకి తీసుకోగా మరో 8 మంది పరారీలో ఉన్నట్లు నార్త్ జోన్ టాస్క్‌పోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ నార్త్‌జోన్ టాస్క్ పోర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్ఖాన పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్‌రాక్ ఎన్‌క్లేవ్ రోడ్డు నెం 12 ఫ్లాట్ నెం 210లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఆర్మీ కల్నన్ క్యాప్టెన్ డికె.గిరి ఇంట్లో గత నెల 16వ తేదీన నేపాల్‌కు చెందిన బహుద్దర్ షాహి,మహేంద్ర బహుద్దర్ షాహి అనే భార్య,భర్తలు ఇద్దరు నేపాల్ నుంచి నగరానికి వలస వచ్చి రిటైర్డ్ ఆర్మీ అధికారి గిరి ఇంట్లో పనిమనుషులుగా చేశారు. ఇంటి యజమానుల కదలికలను అర్థం చేసుకొని వారికి సంబంధించిన 11 మంది నేపాల్ గ్యాంగ్ కలిసి పతకం వేసుకొని రిటైర్డ్ ఆర్మీ అధికి గిరి ఇంట్లో బందించి 10 లక్షల విలువ చేసే బంగారు అభరణాలతో పాటు 95 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీకెమరాల ఆధారాలతో దోపిడికి పాల్పడ్డా 13 మందిని గుర్తించినట్లు తెలిపారు. వారిలో రాజు బహుదూర్ మహేంద్ర బహుదూర్ గోరేకే బహుదూర్ అమీత్, సుభాష్ అనే 5 గురిని అరెస్ట్ చేయడంతో పాటు దోపిడికి పాల్పడ్డా మరో 8 మంది పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నార్త్‌జోన్ డిసిపి రషినపెరుమాల్,తిరుమలగిరి ఏసీపీ రమేశ్, టాస్క్ పోర్స్‌సిఐ చంద్రశేఖర్, కార్ఖన ఇన్‌స్పెక్టర్ బి.అనురాధ, డిఐ రంగారెడ్డి, రాజశేఖర్‌ల సహాయ సహకారాలతో దోపిడికి పాల్పడ్డా నిందితులను అదుపులోకి తీసుకొని 73.35 గ్రాములు బంగారం, 22.90 గ్రాముల వెండి అభరణాలు, 1 వాచ్, 43వేల 50 రూపాయల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని దోపిడికి పాల్పడ్డా ఐదుగురిని అరెస్టు చేసినటు తెలిపారు. ఇండ్లల్లో పనిమనుషులుగా చేర్చుకునే వ్యక్తుల ఆధార్ కార్డులు, ఐడీ కార్డులు,వారి కుటుంబ వివరాలను తెలుసుకొని పనిలో పెట్టుకోవాలని సూచించారు.

## ఉత్సాహంగా "జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ "



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మర్రి లక్ష్మారెడ్డి

**హైదరాబాద్,డిసెంబరు 8,ప్రభాతవార్త:** ఎన్ఈసీసీ-జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) రెండో సీజన్ పోటీలు జోరుగా కొనసాగుతున్నాయి. స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జాట్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్ రెండో రోజు, సోమవారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌ల్లో ఘన విజయాలు సాధించిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. రెండో రోజు పోటీలను టాస్ వేసి ప్రారంభించిన అని ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఆయ మ్యాచ్‌ల్లో సత్తా చాటిన క్రికెటర్లకు బెస్ట్ ప్లేయర్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పాత్రికేయులకు ఎస్‌జాట్ ప్రొఫెషనల్ స్థాయిలో జేపీఎల్ నిర్వహించటం అభినందనీయమని అన్నారు. జర్నలిస్ట్‌లు పనితో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని ప్రతి రోజు అర గంట వ్యాయమానికి కేటాయించాలన్నారు. వెటరన్ క్రీడాకారులు మలి వయసులోనూ ఉత్సాహంగా మైదానంలో పోటీపడుతున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకుని జర్నలిస్ట్‌లు క్రీడల్లోనూ క్రియాశీలంగా ఉండాలి. మంచి ఆరోగ్యంతోనే మెరుగైన జీవనం సాధ్యమని మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు.

**PUBLIC NOTICE**

The Public in General is hereby informed that our client **Mohammed Ibrahim,** S/o Mohammed Waheed, R/o Hyderabad, T.G, Intends to purchase, all that property consisting of G + 2 Floors, constructed on Eastern side portion of Plot No.3, bearing H.No.15-5-829, (Part) admeasuring 56.92 Sq.yards, Situated at Afzalgunj, Hyderabad, T.G, from its lawful owner Musramthota Laxminarayana, S/o Musramthota Shankaraiah Chary, R/o Hyderabad, T.G, and paid considerable sale consideration for the above said property.

If any person or persons or body of persons have got any claims or rights or objection of whatsoever in nature, in respect of the above said property may approach/contact the undersigned within (7) Seven days from the date of publication of this Public Notice along with all the original relevant documents, failing which our client will proceed and complete the sale transaction and the Registration of Sale Deed, thereafter no claim or objections will be entertained and the same if any will be deemed to have been waived.

**Sd/- M/S M S SULTAN ADVOCATES**
**Off:** H.No.20-4-662/1, Shahgunj, Hyderabad-2.
**Ph.No. +91 8686354806.**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, కాప్రా సర్కిల్-1, GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
నిట్ నం. GHMC/KC/E/1/21/2025-26, తేది: 08.12.2025.
క్ర.సం.1, నిట్ నం: పైన పేర్కొన్నది. పని పేరు: GHMC, కాప్రా సర్కిల్-1లో BT ప్యాచ్‌లు మరియు ఇతర పనులు 9 సం.లు. **మొత్తం లక్షలలో: రూ.72.80 లక్షలు.** బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 08.12.2025 సా.6.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది: 11.12.2025 మ.3.00 గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 11.12.2025 మ.3.00 గం. ప్రైస్ బిడ్ తెరచు తేది: 11.12.2025 మ.3.01 గం. అధికారి పేరు & చిరునామా: ఫోన్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-I, GHMC, హైదరాబాద్: 9989930401. **మొత్తం: రూ.72.80 లక్షలు.** తదుపరి వివరాలు: https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-I, GHMC
DIPR.No.11817-PP/CL/Advt/1/2025-26, తేది: 08.12.2025

## సత్యసాగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్



సత్యసాగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం డిసెంబర్8,ప్రభాతవార్త :** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సత్యసాగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీలో పర్యటించారు.కాలనీలో నూతన రోడ్లు, సంక్షేమ సంఘం భవనముకు మరమ్మతులు మరియు కాలనీలో పేరుకుపోయిన చెత్తచెదారాలు తొలగించాలని కాలనీవాసులు కార్పొరేటర్ గారిని కోరడం జరిగింది.స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో చెత్తాచెదారాలను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని మరియు త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ కార్తీక్, కాలనీ అధ్యక్షులు శ్యామ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కాళేష్ , ట్రెజరర్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అరుణ్ మరియు కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## గ్రాప్‌లింగ్ క్రీడలకు పెరుగుతున్న ఆదరణ : కోచ్ ఆదిమూల కృష్ణ




విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కోచ్ ఆదిమూల కృష్ణ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** గ్రాప్ లింగ్ క్రీడలకు సంబంధించి ఆదరణ పెరుగుతోందని రాకంబాట్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ ఆదిమూల కృష్ణ పేర్కొన్నారు. మహావీర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ తెలంగాణ రాష్ట్ర గ్రాప్ లింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో నగరానికి చెందిన మాస్టర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు పోటీలలో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించి తమ సత్తాను చాటారు. తెలంగాణ రాష్ట్ర గ్రాప్ లింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులను కోచ్ ఆదిమూల కృష్ణ ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో గ్రాప్ లింగ్ క్రీడలను నూతనంగా ప్రవేశపెట్టారని, గ్రాప్ లింగ్ క్రీడలు ఒక రకమైన కుస్తీ పోటీ మాదిరిగా ఉంటుందని వివరించారు. గ్రాప్ లింగ్ క్రీడల పట్ల విద్యార్థులు మంచి ఆసక్తిని చూపిస్తున్నారని తెలిపారు. గ్రాప్ లింగ్ పోటీలలో రాజ, కార్తివం, శక్తి రామ్ లు బంగారు పతకాలు, మహావీర్, అబ్దుల్లా, ధనుష్, ఫైజన్ ఖాన్, ఆతిఫ్ హుస్సేన్, అమన్ అలీ లు రజత పతకాలు , అనురాగ్, ఋషి కుమార్ ,మీర్ అలీ జాఫర్, శివ దత్త, జయ రాం ,సాత్విక్ లం కాంస్య పతకాలు సాధించారని వివరించారు. ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. యువత మార్షల్ ఆర్ట్స్ పై ఆసక్తి చూపించాలని సూచించారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే అహ్మద్ బలాల



**మలక్ పేట, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఆస్మాన్ ఘాడ్ డ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, ఏడీలు ఏఈ తదితర విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మలక్ పేట నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో కవార్డు కండక్టర్స్, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు తదితర అంశాల గురించి విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల చర్చించారు. మలక్ పేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చేపడుతున్న చర్యల గురించి డిఇ విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే బలాల కు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, ఏడీఇలు వినోద్ రెడ్డి, శోభన్ బాబు, ఏఇలు సంతోష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, కార్పొరేటర్లు మినాజుద్దీన్, సలాం షహీద్, నాయకులు అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

## మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కృష్ణవేణి



చిల్లంచర్ల కృష్ణవేణి

**ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** మానవ హక్కుల కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా హబ్సిగూడకు చెందిన చిల్లంచర్ల కృష్ణవేణి నియమితులైయ్యారు. ఈ మేరకు సోమవారం హెడ్ వరల్డ్ సంస్థ చైర్మన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేసి చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చిల్లంచర్ల కృష్ణవేణి మాట్లాడుతూ ఎపి, తెలంగాణ రాష్ట్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా గా నియమించినందుకు చైర్మన్ మాధవ్, జాతీ య ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండలకు ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిల్ అభివృద్ధికి శక్తి మేరకు సంస్థ ఎదుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. బాధితులకు అండదండగా ఉంటూ, వారికి న్యాయం లభించే లాగా పోరాటం చేస్తానని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. సంస్థ నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయడంతో పాటు వారి ఆదేశాల మేరకు అవసరమైన కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలను ఆమెను సత్కరించారు.

# ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఆరు డివిజన్లు ఏర్పాటు..!

## -కొత్త ప్రతిపాధనలు సిద్ధం - మరో రెండు కొత్త డివిజన్లు



ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ( ఫైల్ ఫోటో)

**ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా కొత్త డివిజన్ల ఏర్పాటుకు కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. గతంలో 150 ఉన్న డివిజన్లను అధికారులు సుమారు 300 డివిజన్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని ఉప్పల్, కాప్రాలలో గతంలో పది డివిజన్లు ఉండగా కొత్తగా మరో ఐదు కొత్త డివిజన్లు ఏర్పాటు అవుతున్నాయి. గత ఎన్నికల సమయంలో కాప్రా డివిజన్‌లో 43498 ఓట్లు, ఎఎస్‌రావునగర్ డివిజన్‌లో 35888, చర్లపల్లి డివిజన్‌లో 42650, హెచ్‌బి కాలనీలో 34299, మల్లాపూర్‌లో 51477, నాచారంలో 47589, చిలుకానగర్‌లో 48139, హబ్సిగూడలో 45092, రామంతాపూర్‌లో 42110, ఉప్పల్ డివిజన్‌లో 50403 ఓట్లు ఉన్నాయి. అయితే కాప్రా సర్కిల్‌లో మరో మూడు డివిజన్లు, ఉప్పల్‌లో మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో 358 పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రస్తుతం వీటిని 400 వరకు పెంచినట్లు సమాచారం. ఉప్పల్ సర్కిల్‌లో ఉన్న ఉప్పల్, రామంతాపూర్ డివిజన్‌లను విభజించి మరో రెండు కొత్త డివిజన్లు ఏర్పాటు చేశారు. చిలుకానగర్, హబ్సిగూడ డివిజన్లు యథావిధిగా ఉంచారు. వీటిలో ఎటువంటి మార్పు చేయలేదు. గతంలో ప్రతి డివిజన్‌ను రెండుగా విభజించి 8 డివిజన్లు చేయాలని భావించినప్పటికి అధికారులు తిరిగి వాటిని ఆరు డివిజన్లకు సరిపెట్టారు. ఉప్పల్ డివిజన్‌ను రెండు విభజించి రోడ్డుకు ఒక వైపు ఉప్పల్ డివిజన్, మరో వైపు భగాయత్ డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు. రామంతాపూర్ డివిజన్‌ను రెండుగా విభజించి రామంతాపూర్, మూసి పరివాహక ప్రాంతాలను కలిసి మరో డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు. కొత్త డివిజన్‌లలో సుమారు 40వేల ఓటర్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా బోడుప్పల్‌లో రెండు డివిజన్లు, పీర్జాదిగూడలో రెండు డివిజన్లు, చెంగిచర్లలో ఒక డివిజన్, ఘట్‌కేసర్‌లో రెండు డివిజన్లు ఏర్పాటు అవుతున్నాయి.

**ఉప్పల్‌లో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు :** ఈస్ట్ జోనల్ కార్యాలయం కోసం ఉప్పల్, ఘట్‌కేసర్ ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఉప్పల్, కాప్రా, మేడిపల్లి, ఘట్‌కేసర్, పీర్జాదిగూడ, ఎల్‌బినగర్ సర్కిల్ కార్యాలయాలను ఒక జోన్‌గా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న జోనల్ కార్యాలయం దూరం కావడంతో ఉప్పల్ సర్కిల్ కార్యాలయం అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఉప్పల్ సర్కిల్ కార్యాలయం భవనానికి అధికారులు రూ.25లక్షలతో కొత్త హంగులతో తీర్చిదిద్దుతున్నారు. కొత్త ఫర్నిచర్‌తోపాటు పై అంతస్తులో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే ఘట్‌కేసర్‌కు జోనల్ కార్యాలయానికి తరలించేందుకు అక్కడి నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల నుంచి త్వరలోనే దీనిపై పూర్తి క్లారిటి వచ్చే అవకాశం ఉంది. ఏది ఏమైనా కొత్త డివిజన్ల ఏర్పాటుతో శివారులోని పలువురు రాజకీయ పార్టీ నేతలు ఉన్న కొన్ని కార్పొరేటర్ పదవుల కోసం పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన చంపాపేట



పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి పుల్లూరి ఉపేందర్ గుప్తా తదితరులు

**సైదాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** చంపాపేట ఎస్వి సెరెనీ అపార్ట్‌మెంట్స్‌లో శబరి గిరీషుడు అయ్యప్ప స్వామి 18వ మహాపడి పూజ మహోత్సవాన్ని గురుస్వామి పుల్లూరి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గణపతి, సుబ్రమణ్య స్వామి పూజలు చేశారు. హరిహర సుతుడికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప నామ స్మరణతో చంపాపేట పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. భార్గవ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో గోపాల్ గురుస్వామి, రవి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

### - ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**నేరేడ్ మెట్, డిసెంబర్ 8,ప్రభాతవార్త**

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను అర్థం చేసుకున్న తొలి రోజు నుంచే అన్ని వర్గాలకు చెందిన ప్రజల మనోభావాలకు, అవసరాలకు ప్రతినిధిగా నిలుస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి చేస్తున్న సేవలు ఎనలేనివి అని మాజీ కార్పొరేటర్ నిర్గొండ జగదీష్ గౌడ్ పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిపాలన వ్యవస్థను చురుగ్గా కదిలిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ప్రతి రోజు తన కార్యాలయంలో ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుంటూ వినతులను స్వీకరించే ఆయన, మల్కాజిగిరి అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారన్నారు. విభిన్న శాఖల కార్యాలయాలను సందర్శిస్తూ, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి అమలు దిశగా చర్యలు చేపట్టేటట్లు ఒత్తిడి తీసుకువెళ్తున్న రాజశేఖరరెడ్డి శాసనసభలో కూడా ప్రజా సమస్యలను గళమెత్తి లేవనెత్తుతున్నారు. బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్షిప్, వడ్డెర కులస్తుల సమస్యలు, రేషన్ డీలర్ల సమస్యలు, గిగ్ వర్కర్స్ సమస్యలు వంటి పలు కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటం చేశారు. అదే విధంగా నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల కబ్జాలను అరికట్టాలని, వక్ఫ్ బోర్డు రిజిస్ట్రేషన్ నిలిపివేత జాబితా నుంచి పేదలు నివసిస్తున్న కాలనీలు, బస్తీల సర్వే నంబర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజలకు ఊరట కలిగించారు. మల్కాజిగిరిలో హైడ్రా యూనిట్‌కు అనుమతుల విషయంలో గట్టి పోరాటం చేసి ప్రభుత్వం వెనక్కితిరిగేలా చేశారన్న విషయాన్ని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రజా సమస్యలను అవగాహన చేసుకుని, వాటి పరిష్కారానికి నిరంతర పోరాటం సాగించే నాయకత్వం కలిగిన ప్రజా ప్రతినిధిగా రాజశేఖరరెడ్డి ముందుకు సాగుతున్న తీరు మల్కాజిగిరిలో విశేషంగా చర్చనీయాంశమైందని స్థానిక ప్రజలు మాజీ కార్పొరేటర్ నిరు గొండ జగదీష్ గౌడ్, గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేఘల సునీత రామ యాదవ్ లో పేర్కొన్నారు.

## ఎండోమెంట్ కాలనీ నీటి సమస్య పరిష్కారం : బండారు శ్రీవాణి



రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** రామంతపూర్ డివిజన్ ఎండోమెంట్స్ కాలనీలో తాగు నీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం జలమండలి అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి మాట్లాడుతూ ఎండోమెంట్ కాలనీలో నీటి సరఫరా సక్రమంగా రావడం లేదని, మంచినీటి సరఫరా సక్రమంగా అందడం లేదన్నారు. కాలనీలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే అధికారులకు చెప్పి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. తక్షణమే పారిశుధ్య అధికారులను పిలిపించి పనులు చేయించారు. సకాలంలో స్పందించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణిని పలువురు అభినందించారు. దీనిపై జలమండలి అధికారులు స్పందిస్తూ మంచినీటి లోప్రెజర్ సమస్యపై అధికారులు సాంకేతిక లోపం కారణంగా తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని, రేపటి నుండి వచ్చే నీటి సప్లై నుంచే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, శానిటేషన్ డిఇ చంద్రకాంత్, కాలనీ నేతలు ప్రభాకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు ప్రతిపాదనలు చేయాలి : బన్నాల గీత



జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం చిలుకానగర్ వార్డు కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టెండర్ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. మల్లికార్జున్ నగర్, చిలుకానగర్ గుట్టపై నుంచి వచ్చే స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ అవుట్ లెట్ నిర్మాణం, ఆదర్శనగర్ మోడల్ స్మశానవాటిక పనులు పూర్తి చేయాలని సూచించారు. స్వామి వివేకానంద విగ్రహం నుంచి కావేరినగర్ కల్వర్టు వరకు రూ.6 కోట్లతో పైప్‌లైన్ పనులు శంకుస్థాపనకు ఏర్పాటు చేయాలని కోరారు. సిసిరోడ్లు, కమ్యూనిటిహాల్స్ నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మల్లికార్జున్ నగర్ కాలనీలో నాచారం చెరువు నుండి వచ్చే వరద నీరు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కులలో ఒపెన్ జిమ్‌లు, ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇ వెన్నెల గౌడ్, ఎఇ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్ తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీలకు లాభం చేకూర్చేందుకే విత్తన చట్టం



**తుర్కయంజాల్ డిసెంబర్8, ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ అంబేద్కర్ రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ఆధ్వర్యంలో సీడ్స్ బిల్లు 2025/ ఎలక్ట్రిక్ సిటీ బిల్లు 2025 ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ... సంయుక్త కిసాన్ మోర్చ రైతులు దేశవ్యాప్తంగా గ్రామాల్లో డ్రాఫ్ట్ విత్తనాల బిల్లు 2025 ప్రతులను దహనం చేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో దహనం చేయడం జరిగిందని పేర్కొన్నారు.2025 నవంబర్ 12 న వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ డ్రాఫ్ట్ విత్తనాల బిల్లు, 2025ను ప్రకటించింది. డిసెంబర్ 11, 2025 వరకూ ప్రజా అభిప్రాయాలను ఆహ్వానించింది. ఈ బిల్లు 1966 విత్తనాల చట్టాన్ని రద్దు చేసి, కఠినమైన నాణ్యత నియంత్రణలు మరియు ప్రధాన తప్పులకు మాత్రమే శిక్షల తో విత్తన నియంత్రణ వ్యవస్థను ఆధునికీకరించాలనుకుంటుందని ఈ ప్రతిపాదిత చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇది భారత విత్తన రంగంపై బహుళజాతి సంస్థల ఆధిపత్యాన్ని పెంచి, ఆహార భద్రత, విత్తన స్వావలంబన, రాష్ట్రాల సమాఖ్య హక్కులను బలహీనపరుస్తుందని కాబట్టి దీన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు డ్రాఫ్ట్ బిల్లు విత్తన సరఫరాపై నియంత్రణను ఎంసిలు మరియు కార్పొరేట్ల చేతిలో కేంద్రీకరించే ప్రమాదం ఉంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం సాధించాలనుకున్న లక్ష్యాన్నే ఇది మరో మార్గంలో సాధిస్తుందని శీరీలీ భావిస్తోంది. ఇది పంటల నమూనాలను కార్పొరేట్ మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే అవకాశం ఉంది. మార్కెట్లో చవకగా, నాణ్యమైన విత్తనాలు సమయానికి లభించే విధంగా హామీ ఇచ్చే ఏ నిబంధన కూడా ఇందులో లేదు ఇది ఆహార భద్రత, రైతుల ఆర్థిక భద్రత, లాభదాయక వ్యవసాయానికి కీలకం. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో చల్ల నారాయణరెడ్డి, రాము, ముత్తయ్య, యాదగిరి, పద్మ, సత్యమ్మ, అండాలు, నరేందర్ గౌడ్, అంజమ్మ, నీలమ్మ, తదితరులు పాల్గొన్నారు

## బైక్ పై నుండి కిందపడి విద్యార్థిని మృతి



**మేడిపల్లి, డిసెంబర్ 8 ప్రభాతవార్త ;** బైక్ పై నియంత్రణ కోల్పోయి జారి కింద పడి ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...దాసరి హసిని (18) శ్రీనిధి కళాశాల ఘట్‌కేసర్ లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో నివాసం ఉంటుంది.ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకి హసిని తన స్నేహితుడు యెల్లగండుల అక్షయ్ (18) తో కలిసి బుల్లెట్ బైక్ పై ఉప్పల్ నుండి ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా, నారపల్లి జైన్ అపార్ట్‌మెంట్ సమీపం లో బైక్ పై నియంత్రణ కోల్పోయి జారి కింద పడింది.ప్రమాదంలో హసిని తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మరణించింది.రైడర్ అక్షయ్ శరీరంపై గాయాలు కావడంతో యశోదా ఆసుపత్రి సికింద్రాబాద్‌కు తర లించి చికిత్స అందిస్తున్నారు.ఇట్టి విషయం పై హసిని తండ్రి భాస్కర్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### : కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ డిఎస్ నగర్ లో రూ.37.85లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు బలరాం, యాదయ్య, శ్రీనివాస్, చందర్, వెంకటేష్, కాశీరాములు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో ఘనంగా యుసిసిఎ, గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు




క్రిష్టియన్స్ వేడుకలకు హాజరైన పారిజాత నర్సింహారెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న అరుణ్ జ్యోతి

**సరూర్‌నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో యునైటెడ్ క్రిష్టియన్ చర్చెస్ అసోసియేషన్ (యుసిసిఎ) సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. అసోసియేషన్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక బడంగ్‌పేట్ సర్కిల్ కేంద్రం లోని ప్రజా భవన్ వేడుకలతో పాటు ముందస్తు గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా క్రైస్తవ కుటుంబాలకు ముందస్తు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గట్టు బాలకృష్ణ, క్రిష్టియన్ అసోసియేషన్‌కు చెందిన ఇమాన్యుయల్, జాషువా, జయరాజ్, మోజెస్, లాజర్ నాయక్, అరుణ్ జ్యోతి, కిశోర్‌లతో పాటు లక్కిశెట్టి మనోహర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంవిఎస్‌ఆర్‌లో ముగిసిన అథ్లెమా-2025 క్రీడోత్సవాలు



ట్రోఫీతో విజేత ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒకటైన నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్ఆర్ కాలేజీలో అథ్లెమా-2025 పేరిట రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్ కాలేజీ క్రీడోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఎంవిఎస్ఆర్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో వివిధ కళాశాలల నుండి దాదాపు వంద జట్లు పాల్గొన్నాయి. సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలతో పాటు టేబుల్ టెన్నిస్, చెస్, మహిళల త్రోబాల్ పోటీలు నిర్వహించారు. విజేత జట్లకు నిర్వాహకులు ట్రోఫీలు అందజేశారు. కాగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అథ్లెమా క్రీడోత్సవాల్లో విజేతలుగా నిలిచిన వారికి అదే విధంగా పోటీల్లో పాల్గొన్న వారికి ఎంవిఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ పివిఆర్ కశ్యప్, సెక్రటరీ డాక్టర్ కెపి శ్రీనివాసరావు, కోశాధికారి జూపూడి సుధాకర్, సంయుక్త కార్యదర్శి సూర్య ప్రభాకర్, వైస్ ఛైర్మన్ సీతారాంబాబు, పవన్‌లతో కాలేజీ ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## సైబర్ నేరాలతో తస్మాత్ జాగ్రత్త : సిఐ గోవిందరెడ్డి




బోడుప్పల్ సర్కిల్ బొల్లిగూడలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి , మేడ్చల్ బీ బ్లాక్ జనరల్ సెక్రెటరీ కొత్త కిషోర్ గౌడ్, కొత్త దుర్గమ్మ, పడతం లోకేష్ తదితరులు

**బోడుప్పల్, డిసెంబర్ 8 ప్రభాతవార్త ;** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశానుసారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ బొల్లిగూడాలో మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ సహకారంతో సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన కల్పించడం లక్ష్యంగా సైబర్ వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గోవిందరెడ్డి మాట్లాడుతూ... కాలనీ వాసులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ భద్రత, వంటి అంశాలను, సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు జరిగితే వెంటనే 1930 కు కాల్ చేయడం ద్వారా పోలీసులు, బ్యాంకులు మోసపోయిన మొత్తం రూపాయలను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది. సైబర్ మోసం జరిగిన మొదటి గంట అత్యంత కీలకం. ఈ సమయంలో రిపోర్ట్ చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సీఐ గోవిందరెడ్డి తెలిపారు. అనంతరం కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లోకేష్, కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లో నిర్మాణం జరుగుతున్న మాతృదేవోభవ అనాథాశ్రమానికి ఎమ్మెల్యేగా తన నెల జీతాన్ని విరాళంగా అందజేసిన మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిని అభినందించి సన్మానించిన మీర్‌పేట్ కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎంఎ రజాక్: చిత్రంలో మీర్‌పేట్ బిఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీతా బాలరాజ్ తదితరులు ఉన్నారు